# కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

- ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 16 : కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు ఎ.జయరాజు అన్నారు. శనివారం భువనగిరి కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లాలోని న్యాయమూర్తులు, పోలీసు, జిల్లా పరిపాలన యంత్రాంగం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30న జిల్లాలోని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే అన్ని కోర్టు ప్రాంగణాలలో ప్రి సిట్టింగ్స్ ఏర్పాటు చేశామన్నారు. న్యాయవాదులు, పోలీసు, ఏపీపీలు, జిల్లా యంత్రాంగం భాగస్వాములై రాజీ పడే కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. తద్వారా కక్షిదారుల నేర ప్రవృత్తిలో మార్పు వస్తుందని చెప్పారు. మొత్తంగా 4,700 కేసులను గుర్తించి వాటిని పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ సంస్థలు ప్రీలిటిగేషన్ల ద్వారా పరిష్కరించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ వివాదాలు దాదాపు 12 కేసులను పరిష్కరించేలా గుర్తించామన్నారు. ఇట్టి కేసులను పరిష్కరించేలా జాయింట్ కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వీడియో కాన్ఫరెన్స్‌లో రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్ న్యాయమూర్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతిదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.నవీన్‌కుమార్, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎంపీపీఒ పద్మజ, రామన్నపేట ఏపీపీఒ ఖాజానిజాముద్దీన్, చౌటుప్పల్ ఏపీపీఒ అవినాష్, ట్రాఫిక్ సీఐ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, సహాయ న్యాయవాదులు జైపాల్, శంకర్ పాల్గొన్నారు.

# పోచంపల్లి అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 16 : పట్టణాభివృద్ధికి రాజకీయాలకతీతంగా సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్ అన్నారు. శనివారం పురపాలక సంఘ భవనంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 13 వార్డులో నీటి సరఫరా నిర్వహణ నిమిత్తం రూ.15లక్షలు, అదనపు హాల్ నిర్మాణం కోసం రూ.10లక్షలు, తెలంగాణ హరితహారం కార్యక్రమం ద్వారా నర్సరీ నిర్వాహణకు రూ.5లక్షలతో పట్టణ ప్రగతి 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టేందుకు తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు దారెడ్డి మంజుల, కొంగరి కృష్ణ, సురుకంటి జ్యోతి, పెద్దల చక్రపాణి, సామల మల్లారెడ్డి, భోగ భానుమతి, మోటె రజిత, కుడికాల అఖిల, దేవరాయ కుమార్, కో ఆప్షన్ సభ్యుడు జల్లి నర్సింహ, మేనేజర్ శ్రీనివాస్‌స్వామి, ఏఈ శ్రీరాములు, పాల్గొన్నారు.

# 21న జిల్లాస్థాయి పోటీలకు యువ కళాకారుల ఎంపిక

భువనగిరి అర్బన్, డిసెంబర్ 16 : జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి కళా పోటీలకు ఈనెల 21న యువ కళాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి కె.ధనుంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి పట్టణంలో ఉదయం 9.30 గంటలకు ఎంపిక ఉంటుందని, పాల్గొనదలచిన వారు 15 -29 మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన కళాకారులు జనవరి 12నుంచి 16 వరకు జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. కళాకారుల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం ఉంటుందన్నారు. ప్రదర్శనలో పాల్గొనే వారు వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్, అడ్రస్, ఫోన్ నంబర్, ప్రదర్శన పేరు తదితర వివరములతో dysoyadadri@gmail.com కు ఈ నెల 20లోపు మెయిల్ చేయాలని కోరారు. సంబంధిత పత్రాలను మరిన్ని వివరాలకు 8309992451, 8374333378 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

**సామూహిక ప్రదర్శనలు:**

**జానపద నృత్యం (గ్రూప్) :** ఒక్కొక్క బృందంలో 10 మందిని మాత్రమే అనుమతిస్తారు. జానపద నృత్యాలు భారత సాంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. ప్రదర్శనకు గరిష్ట కాల పరిమితి 15 నిమిషాలు మాత్రమే. గ్రూప్‌లో మొత్తం మగవారు గాని, ఆడ వారు గాని, అందరు కలిసి ఉండవచ్చు. వాయిద్య పరికరాలు వారే తెచ్చుకోవాలి. లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది.

**జానపద నృత్యం (సోలో) :** ఒక్కొక్క బృందంలో ఐదుగురిని మాత్రమే అనుమంతిస్తారు. జానపద నృత్యాలు భారత సాంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. ప్రదర్శనకు గరిష్ట కాల పరిమితి 7 నిమిషాలు. లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

**జానపద గేయాలు(గ్రూప్) :** ఒక్కొక్క బృందంలో 10 మంది వరకు మాత్రమే అనుమతిస్తారు. జానపద గేయాలు భారత సాంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సినిమా పాటలు అనుమతించబడవు. ప్రదర్శనకు గరిష్ట కాల పరిమితి 7 నిమిషాలు.

**జానపద గేయాలు (సోలో) :** ఒక్కొక్క బృందంలో అందరు కలిపి 5 మంది వరకు మాత్రమే అనుమతిస్తారు. జానపద గేయాలు భారత సాంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సినిమా పాటలు అనుమతించబడవు. ప్రదర్శనకు గరిష్ట కాల పరిమితి 7 నిమిషాలు.

**వ్యక్తిగత ప్రదర్శనలు:**

**వ్యాస రచన పోటీలు :** ఎంపిక చేసిన అంశం పై ఇంగ్లీష్‌లో 60 నిమిషాలు వ్యాసం రాయాల్సి ఉంటుంది. ఒక్కసారి ఎంపిక చేసిన అంశం మార్చేందుకు వీలు కాదు.

**పోస్టర్ మేకింగ్ :** పెయింటింగ్ చేయుటకు గరిష్ట కాల పరిమితి 90 నిమిషాలలో ఏ3 సైజు పేపర్ మీద పేయింటింగ్ వేయవలెను. సామగ్రి వెంట తెచ్చుకోవాలి.

**వక్తృత్వ పోటీ :** అభ్యర్థులు లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశంపై ఇంగ్లీష్‌లో 3 నిమిషాలు మాట్లాడాల్సి ఉంటుంది. ఒక్కసారి ఎంపిక చేసిన అంశం మార్చడం కుదరదు.

**ఫొటోగ్రఫీ :** రెండు ఫొటో గ్రాఫ్స్ కింద తెలిపిన అంశాల్లో మొబైల్ లేదా కెమెరాతో పాటు ప్రింట్ కూడా తీసుకొని రావలెను. ఫొటో 1ఎంబీకి తక్కువ కాకుండా 2ఎంబీకి ఎక్కువ కాకుండా ఉండవలెను. 1.ప్రగతిశీల భారత్, 2.ఆత్మ నిర్భర్ భారత్, 3.యోగా లేదా క్రీడలు, 4.ఫిట్‌నెస్, శారీరక్రమ, 5.ప్రకృతి దృశ్యంపై తీసుకురావాలి.

## పోచంపల్లి ఇక్కత్ భౌగోళిక గుర్తింపు పునరుద్ధరణపై హర్షం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 16 : భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చేనేత ఉత్పత్తికి సంబంధించిన భౌగోళిక గుర్తింపును (జియోగ్రాఫికల్ ఇండికేషన్స్) మరో 10 ఏండ్లకు పునరుద్ధరణపై టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, ప్రధాన కార్యదర్శి భారత లవ కుమార్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ భౌగోళిక గుర్తింపు పొందిన మొట్టమొదటి చేనేత ఉత్పత్తి కేంద్రం పోచంపల్లి ఇక్కత్ కావడం అదృష్టమన్నారు. త్వరలోనే పోచంపల్లి ఇక్కత్ లోగో పునరుద్ధరణకు నోచుకుంటుందని తెలిపారు.


కలెక్టర్ హనుమంత్ కె జెండగేకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ యాదయ్య గౌడ్

## రేషన్ షాప్ మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి

సంస్థాన్‌నారాయణపురం, డిసెంబర్ 16 : మండలంలోని అల్లందేవిచెరువు పంచాయతీలో రేషన్ షాప్ మంజూరు చేయాలని సర్పంచ్ సుర్వి యాదయ్యగౌడ్ జిల్లా కలెక్టర్ హనుమంత్ కె జెండగేకు శనివారం వినతిపత్రం అందజేశారు. రేషన్ షాప్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు అద్భుతం

- రాష్ట్ర ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ సుమిత

భూదాన్ పోచంపల్లి డిసెంబర్ 16 : పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ సుమిత అన్నారు. శనివారం పోచంపల్లి చేనేత సహకార సంఘంలో ఇక్కత్ వస్త్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. సంస్కృతీ, సంప్రదాయానికి పోచంపల్లి పట్టుచీరలు నిదర్శమన్నారు. చేనేత కళా నైపుణ్యాన్ని కొనియాడారు. ఆమె వెంట జిల్లా చేనేత జౌళీ శాఖ ఏడీ విద్యాసాగర్, డీఓ ప్రసాద్, చేనేత సహకార సంఘ మేనేజర్ రుద్ర ఆంజనేయులు పాల్గొన్నారు.


రోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ రాజు

## సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, డిసెంబర్ 16 : ప్రభుత్వ దవాఖానల్లో నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. శనివారం మున్సిపాలిటీపరిధిలోని లక్కారం 8వ వార్డులోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్, తంగడపల్లి పీహెచ్‌సీ సెంటర్‌లో ఆరోగ్య పారిశుధ్య కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. సీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల క్యాంపు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఉపకేంద్రాల్లో మౌలిక వసతులకల్పనకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొయ్యడ సైదులుగౌడ్, కాసర్ల మంజులాశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, గౌడుగు లక్ష్మయ్య పాల్గొన్నారు.


లా సెక్రటరీ తిరుపతికి వినతిపత్రం అందిస్తున్న భువనగిరి బార్ అసోసియేషన్ సభ్యులు

## లా సెక్రటరీని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 16 : భువనగిరి బార్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో సచివాలయంలో లా సెక్రటరీ రేండ్ల తిరుపతిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. భువనగిరి జిల్లా కోర్టులో వసతులు, కోర్టు భవన నిర్మాణం కోసం బడ్జెట్ కేటాయింపుపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, కౌన్సిల్ సభ్యులు జయకర్, వెంకటరత్నం, సుభాశ్ పాల్గొన్నారు.


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

## సాంస్కృతిక పోటీలు

చౌటుప్పల్, డిసెంబర్ 16 : కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో శనివారం పాలకూర్ల శివయ్యగౌడ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మురళిగౌడ్, వైద్యాధికారి బడుగు శ్రీరాములు, కరెస్పాండెంట్ సిలువేరు ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వాములకు అన్నదానం

చౌటుప్పల్, డిసెంబర్ 16 : మండలకేంద్రంలోని సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గుండెబోయిన అంజయ్య యాదవ్, పెద్దిరెడ్డి గోపాల్, గుండెబోయిన వెంకటేశ్ యాదవ్, బొప్పరబోయిన సతీష్ యాదవ్, కామిశెట్టి భాస్కర్ గుప్తా, బొబ్బిళ్ల మురళి, తూర్పాటి శంకర్, చింతల సాయిలు, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

బీబీనగర్, డిసెంబర్ 16 : మండలంలోని వెంకిర్యాలలో గల లక్ష్మీనారాయణస్వామి ఆలయ పునర్నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భారత ధన లక్ష్మీశివకుమార్ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ రాచమల్ల లక్ష్మీపద్మావతి శ్రీనివాసుకు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ నరేందర్‌రెడ్డి, ధర్మకర్తలు బద్ధం అశోక్‌కుమార్‌గుప్త, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, డబ్బీకార్ రాజేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.